సీత

ప్రతాప రవిశంకర్

దీపాలు వెలిగాయి. వెలిగిన దీపాలతో క్రొత్త అందాన్ని సంతరించుకుంది ఓవర్ బ్రిడ్జి. బ్రిడ్జికి ఎడమ వైపుగా నున్న బట్టలషాపులో జనం క్రిక్కిరిసి వున్నారు. కుడి వైపుగానున్న నైట్ హోటల్‌లోని రికార్డుప్లేయర్ లోనించి ఎల్లారీశ్వరి గొంతు ఎంతో దూరానికి వినిపిస్తోంది.

విరామం లేకుండా రణగొణ ధ్వనులు చేసుకుంటూ హడావిడిగా తిరుగుతున్నాయి వాహనాలు. యువకులూ, యువతులూ, స్నేహితులూ, సన్నిహితులూ, ప్రేమికులూ కబుర్లు చెప్పుకుంటూ పేవ్‌మెంటుమీద నెమ్మదిగా నడుస్తున్నారు. ఎదురుగా వస్తున్నవారిని తప్పుకుంటూ తలవంచుకొని నడచి వెడుతోంది సీత. హోటలుముందుకురాగానే సీతను ఎవరో పిల్చారు.

"సీతా"

'ఎవరు తనని పిలిచింది ?' అనుకుంటూ వెనక్కి తిరిగి చూసింది సీత. తనవెనుకగా పదిగజాల దూరంనించి నడచివస్తున్న అతను కనిపించాడు.



పలకరింపుగా పెదవులమీద చిరునవ్వు. కాంతి నిండిన కనులు. సైడ్‌లాక్స్. పైకిదువ్విన క్రాపు. సగంవరకు మడచిన గ్రేకలరు ఫుల్‌షర్టు. లేతనీలి రంగుపాంటు. చేతిలో సూట్‌కేసు. హుందాగా వున్నాడు.

రెండునిముషాలు అతన్ని పరీక్షగా చూసిన తర్వాత గుర్తుపట్టగలిగింది సీత. ఆమె ముఖంలో సంతోషరేఖలు కదిలాయి. పెదవులు విచ్చుకున్నాయి.

"జోసఫ్" అన్నది సీత.

"థాంక్స్...గుర్తుపట్టావు. నువ్వెవరో నాకు తెలీదు అంటావేమో అనుకున్నాను" నవ్వుతూ అన్నాడతను. నవ్వినపుడు అతని పెదవులు సాగి ఎంతో అందంగా వున్నాయి.

సీతకూడా చిన్నగా నవ్వింది.

ఇద్దరూ ముందుకు కదిలారు.

"ఎప్పుడువచ్చావు ఈవూరు ?" అడిగింది సీత.

"ఇప్పుడే స్టేషనునించి వస్తున్నాను. అనుకోకుండా నువ్వు కనిపించావు. మొదట్లో నిన్నుగుర్తుపట్టలేదు. తర్వాత నీ నడకచూసి నిన్ను పోల్చుకున్నాను. నువ్వు ఈ వూళ్లో వుంటున్నావని మన క్లాసుమేటు ప్రదీప్ చెప్పాడు. కాని నువ్వు ఎక్కడ వుంటున్నావో తెలీదు. ఎలాగైనా మీఇల్లు తెలుసుకుని నిన్ను కలుసుకోవాలనుకున్నాను."

"థాంక్స్. ఇంకా నన్ను మరచిపోనందుకు"

ఒకసారి సీతముఖంలోకి అదోలా చూశాడు జోసఫ్.

ఇద్దరూ బ్రిడ్జి దిగారు.

సెంటర్లో బాగా రద్దీగా వుంది. మనుషులు అక్కడా అక్కడా నిల్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆరోజు ఏవైనా పరీక్ష ఫలితాలు తెలుస్తాయనేమో విద్యార్థులు కిళ్లీకొట్లదగ్గిర పేపరుకోసం ఎదురుచూస్తూ గుమికూడి నిల్చున్నారు. ఇద్దరూ హోటల్ ఉదయశంకర్ దగ్గరకు వచ్చారు.

అక్కడికి రాగానే "నువ్వెక్కడ వుంటున్నావో అడ్రస్ చెప్పు సీతా. రేపు మార్నింగ్ నిన్ను కలుసుకుంటాను" అన్నాడు జోసఫ్.

"అదేమిటి జోసఫ్...ఇప్పు డెక్కడికి వెడతావు ?" అడిగింది సీత.

"హోటల్లో మీల్స్‌చేసి తర్వాత ఒక వ్యక్తిని కలుసుకోవాలి చాలాముఖ్యం ఆఫీసుపనిమీదవచ్చాను" చెప్పాడు జోసఫ్.

"నువ్వు హోటల్లో మీల్స్ చెయ్యటానికి వీల్లేదు. ఈ రాత్రికి నాచేతివంట తినితీరాలి." తప్పదన్నట్లుగా అన్నది సీత.

సీతమాటలు వినగానే జోసఫ్‌కు అమితమైన ఆశ్చర్యం కలిగింది. సీతేనా ఈ మాటలంటున్నది ?! సీతమాటలు జోసఫ్‌కు క్రొత్తగా తోచాయి.

"రేపు మార్నింగ్ తప్పకుండా మీ యింటికి వస్తాను సీతా. ఈరాత్రికి ఆ వ్యక్తిని కలుసుకోవాలి. ఈ ఒక్కరాత్రికీ...ప్లీజ్..."

"వీల్లేదు జోసఫ్...ఏమైనా ఇప్పుడు నువ్వు నావెంట రావాల్సిందే"

కాదనలేకపోయాడు జోసఫ్. "సరే పద" అన్నాడు ముందుకు కదులుతూ...

అరండల్ పేటవైపు తిరిగారు.

జోసఫ్‌ను ఆనుకుని నడుస్తోంది సీత. ఆమె భుజాలు అతనికి రాసుకుంటున్నాయి.

సీత యాంత్రికంగా నడుస్తోంది. మనసు జోసఫ్‌లో వచ్చిన మార్పుగురించి ఆలోచిస్తోంది. 'జోసఫ్‌లో ఎంతమార్పు వచ్చింది! ఇదివరకు చామన చాయలో వుండేవాడు. ఇప్పుడు ఎరుపుకు తిరిగాడు. కొంచెం సన్నగా, బలహీనంగా కనిపించే జోసఫ్ ఇప్పుడు బలిష్టంగా తయారయ్యాడు. మనిషిలో ఆకర్షణ కూడా పెరిగింది.'

జోసఫ్ కూడా సీత పక్కగా నడుస్తున్నాడు కాని అతనూ సీతలో వచ్చిన మార్పుగురించే ఆలోచిస్తున్నాడు. 'తనతో కలసి చదువుకున్న రోజుల్లో సీతకీ ఇప్పటి సీతకీ ఎంత భేదం? సీత ఎంతగా మారిపోయింది! ఆ రోజుల్లో సీత పెదవులమీద ఎప్పుడూ చెరగని చిరునవ్వు నాట్యం చేస్తుండేది. ఇప్పుడూ నవ్వుతున్నదే కాని ఆ నవ్వులో జీవం లేదు. నక్షత్రాల్లా మెరిసే ఆ కళ్లలో తేజం ఇప్పుడు ఏమయింది? పాలు కారుతున్నట్లుండే చెక్కిళ్లు అలా పాలిపోయాయేం? ఆ కనులక్రిందనల్లని చారలు జీవితంలో ఎంతోదూరం ప్రయాణించి అలసిపోయినట్టుగా వున్నాయి. రెండుజడలు వేసుకొని చలాకీగా, సరదాగా తిరుగుతూ నవ్వుతూ, నవ్విస్తూ అందరి హృదయాలను ఆకట్టుకున్న సీతనేనా ఇప్పుడు తను చూస్తున్నది? ఆ సీత పక్కనేనా తను ఇప్పుడు నడుస్తున్నది?'

"నీలో చాలా మార్పువచ్చింది జోసఫ్" అతని ముఖంలోకి చూస్తూ అన్నది సీత.

"నీలో మాత్రం రాలేదూ ... చిక్కి సగమయ్యావు"

"నిజంగా జోసఫ్..." ఆశ్చర్యంగా అడిగింది సీత.

"అవును. నీకు తెలియటంలేదేమో! బాగా నల్లబడ్డావు కూడా"

"నువ్వు ఎర్రబడ్డావుగా...అందుకే నేను నల్లబడ్డాను" నవ్వింది సీత.

అతనూ ఆమె నవ్వులో శ్రుతికలిపాడు.

ఇద్దరూ ఓసందు మలుపు తిరిగారు. ఆ మలుపులో పెద్దమేడ. మేడప్రక్కనే చిన్నపెంకుటిల్లు. ఆ ఇంటిముందాగింది సీత.

"ఇదే మా ఇల్లు" గేటునెట్టుకొని లోపలకు అడుగుపెట్టింది. అతనూ ఆమెను అనుసరించాడు.

తాళం తీసింది సీత.

ఇద్దరూ లోపలకు నడిచారు.

చీకట్లో తడుముతూ గోడ మనున్న స్విచ్ నొక్కింది సీత. లైటు వెలిగింది. కాంతితో గదంతా నిండిపోయింది.

రెండు చిన్న చిన్న గదులు. ముందు గదిలో రెండు గ్రాడెక్ కుర్చీలు. ఒకమూలగా కుట్టుమిషను. మరోప్రక్క రెండు ట్రంకుపెట్టెలు. గోడకు ఒకటి, రెండు పాతఫోటోలు ... ఎప్పటివో రంగువెలిసిన క్యాలెండర్లు దుమ్ముకొట్టుకొని గోడను వ్రేల్లాడుతున్నాయి.

"మీ అమ్మగారు లేరా?" ఇంటిని పరిశీలనగా చూస్తూ అడిగాడు జోసఫ్.

సీత

"అన్నట్లు నీకు తెలీదు కదూ. అమ్మపోయి రెండేళ్లు కావస్తోంది" ఆ మాటలు చెబుతున్నప్పుడు సీత ముఖంలో విచారం వ్యక్తమయింది. తల్లిగుర్తుకు రాగానే సీతకళ్లు అశ్రుపూరితాలైనాయి.

"అయ్యో. అలాగా...నాకుతెలీదు" జోసఫ్ గొంతులో బాధ ధ్వనించింది.

తర్వాత ఇద్దరిమధ్య కొన్నినిముషాలపాటు నిశ్శబ్దం తాండవించింది.

"అయితే నువ్వు..." అతను పూర్తిగా అడగక ముందే అన్నది సీత "ఇప్పుడు ఒంటరిదాన్ని"

సీతను చూస్తుంటే అతనికి జాలికలిగింది. సీత ఒంటరిగా వుంటోంది? అన్నయ్యలిద్దరూ ఏమయ్యారు? సీతను ఒంటరిదాన్నెలా చేశారు? పాపం! ఒంటరిగా ఎలా బ్రతకగలుగుతుందో?

అతని ఆలోచనలను చదివినట్లు "నా ఒంటరి బ్రతుకుగురించి ఆలోచిస్తున్నావా జోసఫ్? ముందు కాళ్లుకడుక్కో ..తర్వాత ఆలోచిద్దువుగాని" నవ్వుతూ చెంబుతో నీళ్లు అందించింది సీత.

బూట్లు విప్పి కాళ్లు కడుక్కుని లోపలకు వచ్చాడు జోసఫ్. అతను లోపలకు వచ్చేసరికి టవలు పట్టుకు నిల్చుంది సీత. టవలు అందుకుంటూ ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె ముఖంలో ఏదోతృప్తి కనిపించింది. ఆమెకనులు మెరుస్తున్నాయి.

"ఈ కుర్చీలో కూర్చుని కబుర్లు చెబుతూ వుండు. అరగంటలో వంటపూర్తిచేస్తాను" వంట గదిలోకి వెడుతూ అన్నది సీత.

సీత ప్రవర్తన జోసఫ్‌కు వింతగా తోచింది. ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అసలు సీతలో ఇంత మార్పు ఎలావచ్చింది? ఎలాంటి సీత ఎలా మారిపోయింది? సీతలో ఇలాంటి మార్పువస్తుందని తనెన్నడూ వూహించలేదు. ఆ రోజుల్లో సీత తనతో బియ్యేచదివేరోజుల్లో -

ఆ రోజులు జోసఫ్‌కు గుర్తురాసాగాయి.

తనక్లాసుమేటు రమణమూర్తిద్వారా తనకు బియ్యే సెకండియర్‌లో పరిచయమయింది సీత. రమణమూర్తి సీతకు దూరపుబంధువు. రమణమూర్తి తను ఎంతో ఆత్మీయులుగా మెలగేవాళ్లు. తరచు రమణమూర్తి ఇంటికి వచ్చే సీతతో తన పరిచయం పెరిగింది. తనకు తెలియకుండానే సీతను ప్రేమించటం మొదలుపెట్టాడు. సీతకూడా తనతో ఎంతో ఫ్రీగా మాట్లాడేది. సీత మాటల్లో తనని అభిమానిస్తున్నదనే భావం తనకు గోచరించేది. అందుకే ఒకరోజు —

ఆరోజు ఆదివారం. తను సాయంత్రం అయిదు గంటలకు రమణమూర్తి ఇంటికి వెళ్లాడు. అతను ఇంట్లోలేడు. ఎక్కడికో వెళ్లాడు. తను వెళ్లబోతుండగా సీత వచ్చింది. రమణమూర్తిలేడని తను చెప్పగానే "బోర్‌కొడుతోంది ... మూర్తి వున్నాడేమో కారమ్స్ ఆడదామని వచ్చాను" అన్నది సీత. "నేనూ అందుకే వచ్చాను. ఎలాగూ ఇద్దరికీ బోర్‌కొడుతోందికదా... పార్కుకు వెడదాం" రమ్మన్నాడు.

అధికోత్పత్తియే
ప్రగతికి మూలం

రెండు క్షణాలాలోచించి తనవెంట బయల్దేరింది సీత.

ఆ చల్లని సాయంత్రం —

హైదరాబాదు రోడ్లమీద పక్కపక్కనే నడుచుకుంటూ పార్కుకు వెళ్లారు. నీరెండలో పచ్చగడ్డిమీద పక్కపక్కనే కూర్చున్నారిద్దరూ. సీత చేతిని తన చేతిలోకి తీసుకొన్నాడు. ఆమె చేతివ్రేళ్లను మృదువుగా రాస్తూ తనకోరికను బయటపెట్టాడు. "నన్ను పెళ్లిచేసుకోవూ ... సీతా" అనడిగాడు. అప్పుడు సీత ఏమన్నది? "చూడు జోసఫ్ ... మనిద్దరి జీవితాలు సమాంతరరేఖలవంటివి. ఎక్కడా కలుసుకోవు. మీరు క్రిస్టియనులు. నేను మీకులం కాదు. మీమతం వేరు. మామతంవేరు. మీ కులం మాకులం ఒకటికాదు. నేను వెజిటేరియన్‌ని. నువ్వు నాన్‌వెజిటేరియన్‌వి. ఇంకా ఎన్నో విషయాలలో మనిద్దరికీ పొత్తు కుదరదు. క్షమించు జోసఫ్ ... ఈ జన్మలో మనపెళ్లి జరగదు." అన్నది సీత. అంతే. ఆ తర్వాత సీతదగ్గర మళ్లీ ఎప్పుడూ పెళ్లి విషయం తీసుకురాలేదు. ఆరోజు అలా మాట్లాడిన సీత ఈరోజు తను క్రిస్టియన్ అనేభావం మరచిపోయినట్లు ఎలా ప్రవర్తించగలుగుతోంది!

జోసఫ్‌కు అంతా విడ్డూరంగావుంది.

"ఏమిటి జోసఫ్ ఆలోచిస్తున్నావు?" అడిగింది సీత. "ఏంలేదు. మనిద్దరం కలసి చదివిన రోజుల్ని గుర్తుతెచ్చుకుంటున్నాను"

"ఆరోజులే మంచివికదూ? ఎంతో సరదాగా.. సంతోషంగా ఎలాంటిదిగులూ లేకుండా గడిచేయి... అవును జోసఫ్...ఇన్నిరోజులూ ఎక్కడ వున్నావ్?" అడిగింది సీత స్టవ్ మంట తగ్గిస్తూ...

"కంపెనీవాళ్లు ట్రెయినింగ్‌కి ఇటలీపంపారు. ఈ మధ్యనే అక్కడినించి తిరిగి వచ్చాను"

"అయితే." ఏదో మాట్లాడబోయింది సీత.

సీత మాటలు పూర్తికాకముందే "బాగానే వృద్ధిలోకి వచ్చానంటావ్. అంతేనా?" అన్నాడు జోసఫ్..

"ఊహూ...నా ఉద్దేశ్యం అదికాదు జోసఫ్..."

"నాకు తెలుసు సీతా ... డిగ్రీ పూర్తవగానే చదువు మానేస్తానని చెప్పాను కదూ ... సరే నా విషయం తర్వాత మాట్లాడుకుందాం ... ముందు నీ సంగతి చెప్పు. నువ్వేం చేస్తున్నావు?" అడిగాడు జోసఫ్...

"ఆ కుట్టుమిషన్ చూడు" మిషన్‌వైపు వ్రేలును చూపిస్తూ అన్నది సీత. మళ్ళీ అన్నది "అదే నా జీవనాధారం"

"అదేమిటి సీతా...డిగ్రీవుందిగా... ఎక్కడైనా ఉద్యోగం చెయ్యలేకపోయావా?"

"చాలా ఉద్యోగాలు చేశాను"

"చేశాను అంటున్నావేమిటి? నీ మాటలు నా కర్థం కావటంలేదు"

"అవును. ఇంతకు ముందు చేశాను. ఇప్పుడు మానేశాను" చెప్పింది సీత...

"ఎందుకు?"

"ఎందుకేమిటి జోసఫ్.. ఉద్యోగం చేసే ఆడదాన్ని ఈ మనుషులు ఎలా చూస్తారో నీకు తెలీదూ?... అందులోనూ తోడులేని ఆడదని

(47వ పేజీ చూడండి)

...స్తే ఇంకెలా చూస్తారో తెలీదూ? నాకు ఉద్యోగమిచ్చిన వారందరూ నన్ను అదేభావంతో చూశారు. ...నసున్న మనిషిగా ఏ ఒక్కరూ చూడలేదు. తోటి ఉద్యోగుల అసభ్య ప్రవర్తన, అందుకే సభ్యత తెలి...ని మనుషుల మధ్య ఉద్యోగం చెయ్యడం ఇష్టంలక మానేశాను. అటువంటి ఉద్యోగాలు చెయ్యడం కంటే మిషను కుట్టుకొని స్వతంత్రంగా బ్రతకటం హాయికదూ?'' నిర్లిప్తంగా నవ్వుతూ అన్నది సీత.

క్షణకాలం జోసఫ్ మాట్లాడలేదు.

తర్వాత ''ఇంకా పెళ్లిచేసుకోలేదేం?'' అడిగాడు.

నవ్వింది సీత.

''ఎందుకు నవ్వుతావ్?''

''నేను చేసుకోక పోవటంకాదు జోసఫ్...నన్ను ఎవరూ చేసుకోలేదు. ఉద్యోగం చేసే రోజుల్లో నన్ను కట్నం లేకుండా చేసుకోటానికి చాలా మంది వచ్చారు. నేను ఉద్యోగం చేస్తున్నానుకదూ. వారంతా నా సంపాదన చూసి ఆశపడినవారే. నిజానికి వారిలో నన్ను పెళ్లి చేసుకొనే అర్హత ఎవరికీలేదు. తీరా ఉద్యోగం మానేసిన తర్వాత పెళ్లిచూపులకంటూ ఎవరూ రాలేదు. కట్నాలు కావాలికాదూ. నా తరఫున కట్నాలు ఇచ్చేవారు ఎవరూలేరు. అన్నయ్యలిద్దరూ వున్నా వారి బ్రతుకులు వారివి. ఈ సవతి చెల్లెలు బ్రతికి వుందన్న విషయం కూడా వారికి గుర్తుండివుండదు. ఇక నాపెళ్లికి నేనే కట్నం ఇచ్చుకోవాలి. కట్నం ఇచ్చుకునే స్తోమతు నాకులేదు. అందుకే నా పెళ్లి కాలేదు''

అతను ఏదో మాట్లాడబోయాడు. కాని ఇంతలోనే ''రా...జోసఫ్... భోజనానికి కూర్చుందాం'' అంటూ పిల్చింది సీత స్టౌమీదనించి కూరగిన్నె దించుతూ...

మాట్లాడకుండా లోపలకు నడిచాడు జోసఫ్. అతనికి కంచంలో వడ్డించి, తను విస్తరిలో వడ్డించు ..., సీత...

పీటమీద కూర్చున్నాడతను.

''వంకాయకూర నీకు సయిస్తుందోలేదో'' ...వేస్తూ అన్నది సీత.

''సయిస్తుంది...వంకాయ కూరంటే నాకు చాలా యిష్టం'' అన్నాడు జోసఫ్...నిజానికి అతనికి వంకాయకూర సయించదు. సీత బాధపడుతుందేమోనని అలా అన్నాడు.

ఇద్దరూ పాత స్మృతులు గుర్తుతెచ్చుకుంటూ భోజనాలు ముగించారు.

చెయ్యికడుక్కొని ముందు గదిలోకి వచ్చాడు జోసఫ్...

పాంటుజేబులోనించి సిగరెట్‌పాకెట్‌తీసి, ఒక సిగరెట్ వెలిగించాడు.

సీత విస్తరిని మడిచి కంచంలో వుంచి పెరట్లోకి తీసుకెళ్లింది.

ఆ దృశ్యం చూసిన జోసఫ్ ''ఇప్పుడు ఏమయిందో తను క్రిస్టియన్ అనే భావం'' అనుకున్నాడు. నిజానికి ఆ దృశ్యంచూసే సీతలోవచ్చిన ...ార్పును తెలుసుకోగలిగాడు జోసఫ్. ఇప్పటి సీత ఇదివరకటి సీతకాదు. ఇప్పటి సీతలో ఇది వరకటి ...శయాలు, ఆదర్శాలులేవు. కాలం సీతను ఎంతగానో

సీత

(30వ పేజీ తరువాయి)

మార్చివేసింది. పరిస్థితులు ఆమెను క్రుంగదీశాయి. ఆ రోజుల్లో సీతకు తను అందంగా వుంటుందని, ఎవరైనా తనని చూడగానే కట్నంలేకుండా చేసుకుంటారనే ధీమా ఉండేవి. తన పెళ్లిచేస్తాడనుకున్న తండ్రి సీత చదువుపూర్తి కాకముందే ఈ లోకం వదిలాడు. తండ్రి మరణంతో సీత ఆలోచనలు చెదిరి పోయాయి. తల్లికూడా పోవటంతో నిస్సహాయురాలయింది. ఒంటరిదై పోయింది. ఒంటరితనం సీతను మరింత క్రుంగదీసి వుండవచ్చు. అందుకే తన ఒంటరి బ్రతుక్కి ఏ మాత్రం తోడు దొరికినా పరవశించిపోతోంది సీత. తారతమ్యాలను మరచిపోగలుగుతోంది.

పెరట్లోనించి వచ్చిన సీత కంచాన్ని స్టాండులో పడేసి వంటిల్లు సర్దుతోంది. చివరి వరకూ కాలిన సిగరెట్ పీకను బయటకువిసిరి బూట్లు తొడుక్కున్నాడు జోసఫ్.

అయిదు నిమిషాల తర్వాత గిన్నెలనుసర్ది వంట గదిలోనించి సీత ముందుగదిలోకి రాబోతుండగా కరెంటు ఫెయిలయింది. లైట్లు పోయాయి.

అంతా చీకటి.

''జోసఫ్'' పిల్చింది సీత.

''ఊఁ'' పలికాడు జోసఫ్.

''ఎక్కడ వున్నావు ?''

''ఇక్కడే... కుర్చీదగ్గర''

నడవబోయింది సీత. దారిలో కుర్చీ తగిలింది. ముందుకు పడబోయింది అక్కడే నిల్చునివున్న జోసఫ్ మీద పడింది. అతని రెండు చేతులూ ఆమెను పట్టుకున్నాయి. లతని గుండెలమీద వాలిపోయింది సీత. అతనికి వెచ్చగావుంది సీత స్పర్శ. సీతకూ హాయిగావుంది అతని గుండెల మీద అలా వాలిపోవటం.

''జోసఫ్'' పిల్చింది సీత చిన్నగా...

''ఊఁ''

''నీకు గుర్తుందా ?'' అడిగింది సీత.

''ఏమిటి ? '' అడిగాడు జోసఫ్.

''అదే జోసఫ్... ఆ రోజు పార్కులో... నీరెండలో...నువ్వు నా చేతి వ్రేళ్లను నిమురుతూ 'నన్ను పెళ్లి చేసుకోవూ... సీతా' అని అడిగావు. అప్పుడు నేనేమన్నాను ? మన పెళ్లి ఈ జన్మలో జరగదు జోసఫ్. మన జీవితాలు సమాంతర రేఖల వంటివని అన్నాను. మన కులాలు వేరని, మతాలు వేరని ఆహారాలు వేరని అన్నాను. కాని తర్వాత తెలుసుకున్నాను జోసఫ్... ఈ కులాలూ, మతాలూ మనం సృష్టించుకున్నవని. అప్పట్లో నేను ఎంత పొరపాటు చేశానో తర్వాత అర్థమయింది. చాలా బాధపడ్డాను. అనవసరంగా ని మనస్సు గాయపరిచాను. నీ కోరికను తిరస్కరించాను. నువ్వు వెళ్లిపోయావు. నా పెళ్లి చెయ్యకముందే నాన్న ఈ లోకం వదిలాడు. తర్వాత అమ్మకూడా వెళ్లిపోయింది. ఒంటరిదాన్నయ్యాను. తోడు లేని జీవితం. ఒంటరి తనాన్ని భరించలేకుండా ఉన్నాను. ఆడది ఒంటరిగా బ్రతకటం చాలా కష్టం జోసఫ్. ఇంకా ఎన్ని రోజులు నేనిలా బ్రతకాలో వూహించుకుంటే భయంగా ఉంది. అప్పుడప్పుడు నేను ఎవరి కోసం బ్రతకాలనిపిస్తోంది? నిజం జోసఫ్... అలా అని అనిపించినప్పుడు బ్రతుకుమీద ఆశ పోతుంది. ఎంతకాలం సాగిస్తాను తోడులేని జీవనయాత్ర? నాకు తోడు కావాలి జోసఫ్... నాకు తోడుకావాలి. అందుకే నిన్ను అడుగుతున్నాను. నన్ను పెళ్లి చేసుకోవూ? నా కోరిక తీర్చవూ'' దీనంగా అన్నది సీత.

ఉలిక్కిపడ్డాడు జోసఫ్. అప్రయత్నంగా అతని చేతులు సీతను వదిలివేశాయి.

''ఏం జోసఫ్... నన్ను పెళ్లి చేసుకోవూ...'' సీత గొంతు జీరబోయింది. ఎంతో ఆత్రుతతో, భయంగా అడిగింది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. జోసఫ్ తన మాటను తిరస్కరించడని కొండంత ఆశతోవుంది.

జోసఫ్ మాట్లాడలేదు.

''మాట్లాడవేం జోసఫ్... నన్ను పెళ్లిచేసుకోటం నీ కిష్టం లేదా ? అలా మౌనంగా నిల్చుంటావేం... ప్లీజ్... చెప్పు జోసఫ్...''

నిముషం తర్వాత ''క్షమించు సీతా... నీలో ఇలాంటి కోరిక వుందని నేను వూహించలేదు. నీలో ఇలాంటి మార్పు వస్తుందని ఏ మాత్రం వూహించి వున్నా ఎన్నేళ్లకైనా నీ కోసం వేచివుండేవాడిని. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు'' అని క్రిందికివంగి కాళ్లదగ్గరవున్న సూట్‌కేసు తీసుకొని టకటకా బూట్లు చప్పుడు చేసుకుంటూ చీకట్లో వెళ్లిపోయాడు జోసఫ్.

హతాశురాలై చీకటిగదిలో అక్కడే నిల్చుంది ఒంటరి సీత.—